

మొండి బకాయి..వసూలు కావోయి

మున్సిపాలిటీల్లో భారీగా పన్నుల బకాయిలు పేరుకుపోయాయి. జిల్లాలో ఆస్తి పన్ను బకాయిలు రూ.65.69 కోట్లు ఉండగా ఇప్పటి వరకు రూ.26.50 కోట్లు వసూలయ్యాయి. - 10లో..



ఆట్యా పాట్యాలో ప్రకాశంకు మూడో స్థానం

ఆట్యాపాట్యా 9వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఆటల పోటీల్లో జిల్లాకు మూడో స్థానం లభించింది. - 10లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 35/27

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో చిరుజల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్



దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నిత్యం వివిధ రూపాలలో అమ్మవారిని అలంకరిస్తున్నారు. ఒంగోలు లాయర్ పేట సాయిబాబా ఆలయంలో రాజరాజేశ్వరీ దేవిని గాయత్రీ దేవిగా అలంకరించి, వివిధ కూరగాయలతో తీర్చిదిద్దిన మండపంలో ఉంచారు. - సాక్షి, ఒంగోలు

టెట్‌కు 93 మంది గైర్హాజరు

ఒంగోలు: జిల్లాలోని మూడు సెంటర్లలో నిర్వహించిన టీచర్స్ ఎలిజిబులిటీ టెస్టు(టెట్)కు సోమవారం 93 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 390 మందికిగాను 53 మంది, సాయంత్రం 395 మందికిగాను 40 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర ప్రకటించారు. పరీక్షలు పూర్తి ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు తెలిపారు.

సేంద్రియ ఉత్పత్తులకు ప్రాధాన్యం




సేంద్రియ కూరగాయలు కొంటున్న కలెక్టర్

ఒంగోలు అర్బన్: ఎటువంటి రసాయనాలు లేకుండా సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసిన కూరగాయలు ఇతర ఉత్పత్తులకు ప్రాధాన్యం లభించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. సోమవారం ప్రకాశం భవనంలో సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు, ఇతర ఉత్పత్తుల కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. స్వయంగా కూరగాయలు కొనుగోలు చేశారు.

మద్యం దరఖాస్తులకు సిండికేట్ నిషా

మద్యం టెండర్ల ప్రక్రియ కొనసాగుతుండగానే అధికార పార్టీ నేతలు రంగంలోకి దిగారు. వారి కుటుంబ సభ్యులు, ముఖ్య అనుచరులు సిండికేట్ల అవతారం ఎత్తారు. వైన్ షాపులు దక్కించుకునేందుకు తెర వెనుక పావులు కదుపుతున్నారు. ఇతరులెవరూ దరఖాస్తులు చేయకుండా పచ్చ సైన్యం బెదిరింపులకు దిగుతోంది. ఫలితంగా నోటిఫికేషన్ ఇచ్చి వారం రోజులు దాటుతున్నా దరఖాస్తుల సంఖ్య పది శాతం కూడా దాటలేదు. 46 మద్యం దుకాణాలకు కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా దాఖలు కాని పరిస్థితి. షాపులన్నీ అధికార పార్టీవారే నిర్వహించేలా 'సిండికేట్' మాయాజాలం నడుస్తోంది. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది.



- అధికార పార్టీ ముఖ్య నేతల కనుసన్నల్లోనే వ్యవహారం
- మద్యం దుకాణాలన్నిటిపై గుత్తాధిపత్యానికి ఎత్తుగడ
- కూటమి ప్రజా ప్రతినిధుల కుటుంబ సభ్యుల పెత్తనం
- బెదిరింపులకు దిగుతున్న పచ్చ సైన్యం
- జిల్లాలో 171 దుకాణాలకు గాను 336 దరఖాస్తులు
- ప్రభుత్వాదాయానికి భారీ గండి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

కొత్త మద్యం పాలసీపై పాలకులు చెప్పే మాటలకు, చేతలకు పొంతనలేకుండా పోతోంది. రెండు లక్షల రూపాయలు దరఖాస్తు రుసుం చెల్లించే స్థోమత కలిగిన వారెవరైనా సరే ఆన్‌లైన్ విధానం ద్వారా ఇంటి నుంచి కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం చెబుతోంది. ప్రభుత్వ పెద్ద అండదండలతో రంగంలోకి దిగిన పచ్చ సైన్యం ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసేందుకు వీలు లేకుండా బెదిరింపులకు దిగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వ్యాపారం సంగతి దేముడెరుగు కనీసం లైసెన్సుల కోసం దరఖాస్తు చేయడానికి కూడా వీలులేని దుస్థితి దాపురించిందని వ్యాపారులు వాపోతున్నారు. జిల్లాలో దశాబ్దాలుగా తాము మద్యం వ్యాపారం చేస్తున్నా గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితిని చూడలేదని చెబుతున్నారు. ఇప్పటికే ఇసుక, రేషన్, మైనింగ్ వ్యాపారాలను కబ్జా చేసుకున్న ప్రజా ప్రతినిధులు ఇప్పుడు మద్యం వ్యాపారాన్ని కూడా తమ గుప్పిట్లోకి తీసుకుని దోపిడీకి దిగడం సిగ్గుచేటన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మద్యం దుకాణాలన్నీ ఒక్కరికే...

గతంలో ఒక వ్యక్తికి ఒక దుకాణం మాత్రమే కేటాయించేవారు. ఎవరైనా పది దుకాణాల కోసం దరఖాస్తు చేసుకొంటే లాటరీలో ఒక షాపు తగలగానే మిగతా షాపుల దరఖాస్తులు రద్దయిపోయేవి. ఇప్పుడా విధానానికి మంగళం పాడారు. మొత్తం మద్యం దుకాణాలను తమ గుప్పిట్లో తీసుకునేందుకు అనువుగా నూతన మద్యం పాలసీని ప్రభుత్వం రూపొందించిందన్న ఆరోపణలు ఉన్నాయి. కొత్త నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. లాటరీలో ఎన్ని దుకాణాలు వస్తే అన్ని దుకాణాలను కేటాయిస్తారు. దీంతో నియోజకవర్గంలోని మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు ఎమ్మెల్యేలు రంగంలోకి దిగారు. ఈ క్రమంలోనే దరఖాస్తుల దగ్గర నుంచే వారు చక్రం తిప్పడం మొదలు పెట్టారని ప్రచారం జరుగుతోంది.

కుటుంబ సభ్యులదే పెత్తనం..

ఎప్పుడైతే ఒక వ్యక్తికి ఎన్ని దుకాణాలైనా ఇచ్చేలా పాలసీ ప్రకటన జరిగిందో వెంటనే ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులు రంగ ప్రవేశం చేశారు. ముఖ్యంగా పశ్చిమ ప్రకాశంలో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. గిద్దలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే సోదరుడు కీలక పాత్ర పోషిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మార్కాపురంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు చక్రం తిప్పుతున్నట్లు చెప్పుకుంటున్నారు. కనిగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కనుసన్నల్లో కథ నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. సంతనూతలపాడు ఎమ్మెల్యే మద్యం వ్యాపారులపై పట్టు బిగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొండపిలో మంత్రి, హార్బర్లు, పోర్టుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌లను కాదని దరఖాస్తు చేసుకునేందుకు ఎవరూ ధైర్యం చేయడంలేదు. ఒంగోలులో సైతం అధికార ఎమ్మెల్యే మాట కాదని ముందడుగు వేసే వాళ్లు లేరు. యర్రగొండపాలెంలో టీడీపీ సమన్వయకర్త తన సొంత వ్యక్తులను దరఖాస్తులు చేసుకోమని చెబుతున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వాదాయానికి భారీగా గండి

అధికార తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రతినిధుల స్వార్థంతో ప్రభుత్వాదాయానికి భారీగా గండి పడుతోంది. జిల్లాలో మొత్తం 171 మద్యం దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు గాను ఒక్కో దుకాణానికి కనీసం 30 దరఖాస్తుల ప్రకారం మొత్తం 5130 దరఖాస్తులను ప్రభుత్వం టార్గెట్‌గా పెట్టుకుంది. కేవలం దరఖాస్తుల రూపంలోనే జిల్లాలో రూ.102.60 కోట్ల ఆదాయం వస్తుందని అంచనాలు వేసింది. నోటిఫికేషన్ విడుదలైన తరువాత గాంధీ జయంతికి ఒకరోజు ముందు నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఈ నెల 9వ తేదీ స్వీకరణ ముగుస్తుంది. అయితే ఇప్పటి వరకు 336 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. జిల్లాలోని 46 మద్యం దుకాణాలకు కనీసం ఒక్కటంటే ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. దీనిని బట్టి చూస్తే ప్రభుత్వ టార్గెట్‌లో 10 శాతం కూడా దరఖాస్తులు రాలేదు. ఇక మిగిలింది కేవలం రెండు రోజులే. ఈ రెండు రోజుల్లో టార్గెట్ పూర్తవుతుందా లేదా అని అధికారులు ఆందోళన చెందుతున్నారు. అధికార పార్టీ పుణ్యమాని ప్రభుత్వాదాయానికి భారీ గండిపడనుంది.

దర్శిలో 50 శాతం ట్యాక్స్..

జిల్లాలో దర్శి నియోజకవర్గంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చెప్పిందే వేదం. మద్యం దుకాణాల కోసం ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని, ఎవరికీ అడ్డుచెప్పమని చెబుతున్నారు. ఇందులోనే ఉంది తిరకాసంతా. మద్యం వ్యాపారంలో ఎవరైనా సరే 50 శాతం వాటా ఇవ్వాల్సిందేనని తెగేసి చెబుతున్నట్టు సమాచారం.

కరువు మండలాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



కరువు మండలాల ప్రతిపాదనలపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలోని కరువు మండలాల ప్రతిపాదనలు ఈ నెల 10వ తేదీ నాటికి పంపాల్సి ఉందని ఆ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనంలో సోమవారం రెవెన్యూ, వ్యవసాయ అనుబంధ శాఖలు, జలవనరులు, భూగర్భ జల శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కరువు మండలాల నిర్ధారణ కోసం ప్రభుత్వం నిర్దేశించిన 6 ఇండికేటర్ల ప్రకారం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు, ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు, నీటి పారుదల శాఖ ద్వారా ఎంత విస్తీర్ణం నీటిని అందిస్తున్నారనే అంశాల ఆధారంగా కరువు మండలాల ప్రతిపాదనలు అందజేయాల్సి ఉంటుందన్నారు. జాగ్రత్తలు వహించి పక్కాగా రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ శ్రీలత, సీపీఓ వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ మాధురి, ఏపీఎంఐపీ పీడీ రమణ, పశుసంవర్ధక శాఖ జేడీ బేబిరాణి, గ్రౌండ్ వాటర్ డీడీ విద్యాసాగర్, హార్టీకల్చర్ అధికారి గోపిచంద్, వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ నివాస ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలి

ఒంగోలు అర్బన్: ఎస్సీ నివాస ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆ మేరకు 100 రోజుల కార్యాచరణలో భాగంగా తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మానాయక్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ౹ మౌలిక సదుపాయాల కల్పనకు ఉన్న అడ్డంకులను పరిష్కరించి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.

పాపం మైథిలి..

- ఎవరికీ పట్టని యువ క్రీడాకారిణి మృతి
- కేసు నమోదు కోసం పోలీస్ స్టేషన్ల చుట్టూ బాలిక తల్లిదండ్రులు
- బాలిక రక్షణ విషయంలో అడుగడుగునా నిర్లక్ష్యం
- సొంత నియోజకవర్గంలో బాలిక మృతిని పట్టించుకోని మంత్రి
- జిల్లా స్థాయి అధికారులు సైతం పట్టించుకున్న దాఖలా లేదు
- అధికారుల తీరుపై మండిపడుతున్న ప్రజా సంఘాలు

ఒంగోలు టౌన్:

ఆ బాలిక ఎంతో భవిష్యత్తు ఉన్న ఫుట్‌బాల్ క్రీడాకారిణి. క్రీడా మైదానంలో మెరుపులా కదిలే ప్రతిభ ఆమె సొంతం. రోడ్డు ప్రమాదంలో అర్ధంతరంగా తనువు చాలించింది. వారం రోజులు గడుస్తున్నాయి. సాక్షాత్తు మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి సొంత నియోజకవర్గానికి చెందిన ఒక జిల్లా స్థాయి క్రీడాకారిణి మరణిస్తే ఇప్పటి వరకు పట్టించుకున్న పాపాన పోలేదు. చివరికి పోలీసులు కూడా కేసు నమోదు చేసుకోకుండా ఆమె తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పుకుంటున్నారు. కుమార్తెను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న వారు న్యాయం కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగే దుస్థితి పట్టింది. కనీసం జిల్లా స్థాయి అధికారులు సైతం ఆ కుటుంబాన్ని పట్టించుకోకపోవడం దారుణం.



రోడ్డు ప్రమాదంలో మరణించిన ఫుట్‌బాల్ క్రీడాకారిణి మైథిలి



మైథిలి తల్లిదండ్రులు వేణు, శ్రీదేవి దంపతులు

ఇంతకూ ఏం జరిగిందంటే...

పొన్నలూరు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన సన్నిబోయిన వేణు, శ్రీదేవి దంపతులకు ఇద్దరు సంతానం. పెద్ద కుమార్తె మైథిలి ముండ్లమూరువారి పాలెం జెడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఫుట్‌బాల్‌లో ప్రతిభ కలిగిన ఆమె అండర్-17 ప్రకాశం జిల్లా ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికైంది. సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో పల్నాడు జిల్లా వినుకొండలో జరిగిన అంతర్‌జిల్లా ఫుట్‌బాల్ టోర్నమెంటులో జిల్లా జట్టు కూడా పాల్గొంది. గత ఆదివారం జరిగిన లీగ్ తొలి దశలోనే టీం ఓడిపోయింది. అప్పటికే చీకటి పడింది. అయినా జట్టు కోచ్, మేనేజర్ బాలికలను తీసుకొని రాత్రికి రాత్రే ఒంగోలుకు వచ్చేశారు. రాత్రి 10 గంటలకు ఒంగోలు చేరుకున్నారు. అంతరాత్రి సమయంలో కొంత మంది బాలికల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి పిలిపించి వారి గ్రామాలకు పంపించారు. మైథిలిని మాత్రం కృపాకర్ అనే యువకుడితో పంపించారు. ద్విచక్ర వాహనంపై వెళ్లిన మైథిలి నెల్లూరు జిల్లా మైదుకూరుపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మరణించడం సంచలనం సృష్టించింది. సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు వేణు, శ్రీదేవి గుండెలు పగిలిపోయాయి. ఫుట్‌బాల్ ఆడి విజయంతో తిరిగి వస్తుందని కలలుగంటున్న వారికి కూతురు శవమై కనిపించడంతో విషాదంలో మునిగిపోయారు.

ఇక్కడే అసలు కథ మొదలైంది..

మైథిలి మరణంపై ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి నెల్లూరు పోలీసులను సంప్రదించారు. మీ స్వగ్రామమైన పొన్నలూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయమని సలహా ఇచ్చారు. 29వ తేదీ మైథిలి మృతదేహాన్ని తీసుకొని నేరుగా పొన్నలూరు పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. ముందుగా అంత్యక్రియలు పూర్తి చేసుకొని రండి, ఆ తరువాత కేసు నమోదు చేద్దామంటూ పంపేశారు. అంత్యక్రియలు పూర్తయిన తరువాత ఫిర్యాదు చేసేందుకు మళ్లీ పోలీసు స్టేషన్‌కు వెళ్లారు మృతురాలి తల్లిదండ్రులు. ఎస్‌ఐ సెలవు మీద వెళ్లారని, కొండపి వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిందిగా చెప్పి పంపించారు. అక్కడ నుంచి కొండపికి వెళ్లారు. రెండు రోజులు ఓపిక పట్టండి, కేసు చేస్తామని చెప్పి పంపించేశారు. పోలీసుల చుట్టూ తిరిగి అలసిపోయిన వేణు, శ్రీదేవి దంపతులు ఆదివారం ఒంగోలుకు వెళ్లి ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు కలిసి తమ బాధ చెప్పుకున్నారు. స్పందించిన ఎస్పీ కనిగిరి సీఐకు కేసు అప్పగించినట్లు చెప్పారని, అక్కడకు వెళ్లి కలవమన్నారని మైథిలి తల్లిదండ్రులు చెప్పారు. సోమవారం మంత్రి స్పందనలో మంత్రి డోలా వీరాంజనేయ స్వామిని కూడా కలిసి తమ బాధను చెప్పుకున్నారు. నేటికీ పోలీసులు కేసు నమోదు చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వెనకబడిన తరగతులకు చెందిన వారిపై వివక్షతోనే...

రోడ్డు ప్రమాదంలో మరణించిన సన్నిబోయిన మైథిలి యాదవ సామాజికవర్గానికి చెందిన బాలిక కావడం, బీసీ వర్గానికి చెందిన క్రీడాకారిణి కావడం వల్లనే ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు వివక్ష చూపుతున్నారని బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాటికలపుడి జయరాం సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. మహిళా పీఈటీ రక్షణ లేకుండా మహిళల టీంను ఒంటరిగా టోర్నమెంటుకు పంపించకూడదన్న నిబంధనలు ఉన్నా లెక్కచేయకుండా టోర్నమెంటుకు పంపించారని ఆరోపించారు. 15 ఏళ్ల బాలికలను అర్ధరాత్రి ఇంటికి ఎలా పంపిస్తారని ఆయన ప్రశ్నించారు. ఒక క్రీడాకారిణి రోడ్డు ప్రమాదంలో మరణిస్తే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న కలెక్టర్, సెక్రటరీగా వ్యవహరిస్తున్న డీఈఓలు క్రీడాకారిణి కుటుంబాన్ని పరామర్శించకపోవడం బాధాకరమన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన డీఈఓను సస్పెండ్ చేయాలని, కలెక్టర్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ కోటు వనజ మాట్లాడుతూ నిబంధనలను ఎక్కడా ఉల్లంఘించలేదని, కృపాకర్‌ను తన సోదరుడిగా చెప్పడం వల్లనే మైథిలిని పంపించినట్లు తెలిపారు.

పరామర్శించే తీరిక కూడా లేదా...


రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి సొంత నియోజకవర్గంలోనే ఒక ఫుట్‌బాల్ క్రీడాకారిణి మరణిస్తే ఆమె తల్లిదండ్రులను పరామర్శించడానికి తీరిక, ఓపిక లేకుండా పోయాయని క్రీడాకారులు, విద్యావేత్తలు విమర్శిస్తున్నారు. స్థానికంగా ఉండే ప్రజా ప్రతినిధులు కూడా పలకరించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్రీడా విభాగానికి చెందిన, విద్యాశాఖకు చెందిన జిల్లా అధికారులు సైతం పట్టించుకోకపోవడం గమనార్హం.

చిత్తశుద్ధితో సమస్యలు పరిష్కరించాలి

- గ్రీవెన్స్ నిర్వహించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు, ఉద్యోగులు ప్రజా సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. సోమవారం గ్రీవెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణతో కలిసి మీకోసం గ్రీవెన్స్ నిర్వహించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రీవెన్స్‌లో మొత్తం 241 అర్జీలు అందగా వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. అర్జీదారులతో మాట్లాడుతున్న ఫొటోలతో పాటు పరిష్కరించిన ఎండార్స్‌మెంట్ కూడా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పరిష్కరించలేని సమస్యలుంటే అర్జీదారులకు వివరించాలన్నారు. దీనిలో డీఆర్‌ఓ శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు ఝాన్సీలక్ష్మి, వరకుమార్, వెంకట సునీల్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

■ త్రిపురాంతకం మండలం ఎండువారిపాలెం గ్రామానికి చెందిన యామర్తి రంగదాసు, పెద్ద నాసరయ్య, శవిరయ్య ఇతర పారిశుద్ధ్య కార్మికులు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి 12 నెలలుగా జీతాలు రావడం లేదని తెలుపుతూ అర్జీ అందజేశారు. ఇంటింటి చెత్త సేకరణ, కాలువల శుభ్రం తదితర పనులు చేస్తామని గత ఏడాది కాలం నుంచి వేతనాలు రావడం లేదని అప్పులు చేసి కుటుంబాలు నెట్టుకువస్తున్నామని పరిశీలించి త్వరగా న్యాయం చేయాలని కోరారు.



గ్రీవెన్స్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



వినికిడి యంత్రాన్ని అందచేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

■ జరుగుమల్లి మండలం కే బిట్రగుంట గ్రామానికి చెందిన దివ్యాంగుడు తన్నీరు శివయ్య గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి తనకు పింఛన్ రూ.15 వేలు ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశాడు. ప్రమాదంలో కాలు, చెయ్యి పూర్తిగా దెబ్బతిన్నాయని ఆ మేరకు 95 శాతంతో సదరమ్ ధ్రువీకరణ కూడా ఇచ్చారని అంగవైకల్యంతో ఏ పని చేయలేని తనకు రూ.15 వేలు పింఛన్ ఇప్పించాలని కోరాడు.

■ చీమకుర్తి మున్సిపాలిటీలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన దర్నాశి శేఖర్ గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి తన తల్లి పేరుతో ఉన్న ఇంటి పన్నును తన పేరుపై కి మార్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ అందజేశాడు. తన తల్లి ఇంటిని తనకు ఇచ్చిందని పన్ను పేరు మార్చాలని అధికారులను ఎన్నిసార్లు అడిగినా స్పందించడం లేదని ఫిర్యాదు చేశారు.

వినికిడి యంత్రం, వీల్ చైర్ అందజేత

గ్రీవెన్స్‌లో దివ్యాంగులు ఇరువురు తమకు అవసరమైన పరికరాలు అందజేయాలని కోరుతూ కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. స్పందించిన కలెక్టర్ వెంటనే దివ్యాంగులకు అవసరమైన పరికరాలను సిద్ధం చేయాలని ఆ శాఖ ఏడీ అర్చనను ఆదేశించారు. కొత్తపట్నంకు చెందిన వృద్ధుడు వడ్లపల్లి వెంకటసుబ్బయ్యకు వినికిడి యంత్రం, మద్దిపాడు మండలానికి చెందిన నడిమేపల్లి నిత్యశ్రీకు వీల్ చైర్‌ను సిద్ధం చేసారు. గ్రీవెన్స్ భవనం వద్ద కలెక్టర్ చేతుల మీదుగా వారికి పరికరాలు అందజేశారు.

జీతాలివ్వండి మహాప్రభో..!

- సమగ్రశిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన



ఆందోళన చేస్తున్న సమగ్రశిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

ఒంగోలు: రెండు నెలలుగా జీతాలు లేవు.. చివరకు పండుగ పూట కూడా పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది.. జీతాలివ్వండి మహాప్రభో అంటూ సమగ్ర శిక్ష ఉద్యోగులు రోడ్కెక్కారు. ఈమేరకు సోమవారం స్థానిక ప్రకాశం భవనం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్, జేఏసీ నాయకులు సింగయ్య, మాధవాచారి, వినయ్, శ్రీదేవి, కవిత, రాణి, వసంతకుమారి, ఏడుకొండలు, ఆనంద్, కిరణ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొని తమ వెతలు వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు తమ డిమాండ్ల పరిష్కారం కోసం 22 రోజులు సమ్మె నిర్వహించామని, ఈ సందర్భంగా కూటమి వర్గాలు తాము అధికారంలోకి వస్తే తమ సమస్యలు పరిష్కరిస్తాం అంటూ హామీ ఇచ్చారన్నారు. కానీ తీరా నేడు హామీలు సంగతి అటుంచితే ఆగస్టు, సెప్టెంబర్ నెలల జీతాలు కూడా విడుదల కాలేదన్నారు. సమస్యను రాష్ట్ర మంత్రి దృష్టికి తీసుకెళితే కొంచెం సమయం తీసుకుని పరిష్కరిస్తామని చెబుతున్నారని, సమ్మె కాలానికి జీతాలు కూడా ఇస్తానన్న హామీపై కూడా స్పష్టత లేకుండా ఉందన్నారు. జీతాలు, సమ్మె కాలపు జీతాలును వెంటనే విడుదల చేయాలని, ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు విడుదల చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

నీరివ్వండి సారూ..

- తాగునీటి కోసం ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన వీకే నగర్ వాసులు



ఆందోళన చేస్తున్న ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై చౌడయ్య

యర్రగొండపాలెం: నెల రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో అల్లాడిపోతున్నామని మండలంలోని వీకే నగర్ వాసులు సోమవారం ఆందోళనకు దిగారు. స్థానిక మాచర్ల రోడ్డులోని వీకే నగర్ (మురారిపల్లె పంచాయతీ)కి చెందిన ప్రజలు నెల రోజులుగా తాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి నీటి ట్యాంకర్ల నిర్వహణ పంచాయతీ సర్పంచ్ ఆమోదం లేకుండా అధికారులు అధికార పార్టీకి చెందిన వారికి ఆ బాధ్యత అప్పచెప్పారు. అప్పటి వరకు నీటిని సరఫరా చేస్తున్న సర్పంచ్ ఏకుల ముసలారెడ్డి జయమ్మకు బిల్లులు చేయకపోవడంతో గత నెల 25వ తేదీ నుంచి వీకే నగర్ వాసులకు తాగునీటి సరఫరా నిలిపి వేయాల్సి వచ్చింది. తాగేందుకు నీళ్లు లేకపోవడంతో ఆ ప్రాంత వాసులు ఖాళీ బిందెలతో హైవేపై ధర్నాకు దిగారు. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పరిస్థితి తెలుసుకున్న ఎస్సై చౌడయ్య సంఘటన స్థలానికి వెళ్లి ఆందోళన చేస్తున్న వారితో చర్చించారు. తమకు తాగేందుకు నీరు సరఫరా చేయకుంటే ఆందోళన విరమించేదిలేదని వారు తెగేసి చెప్పడంతో ఎస్సై సంబంధిత అధికారులతో సమస్య గురించి చర్చించారు. వెంటనే అధికారులు నీటి తోలకం ఏర్పాట్లను సర్పంచ్‌కు అప్పచెప్పడంతో వీకే నగర్ వాసులు ఆందోళన విరమించారు.

జగజ్జననీ పాహిమాం


ఒంగోలు అచలానంద ఆశ్రమంలో శాకంబరిగా గోవిందమాంబ


తాళ్లూరు: గాయత్రీదేవిగా గుంటి గంగాభవాని


భైరవకోనలో మోహినీదేవిగా త్రిముఖ దుర్గ

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాలోని ఆలయాల్లో వేడుకగా సాగుతున్నాయి. అమ్మవారి ఉత్సవమూర్తులను వివిధ రూపాల్లో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. కుంకుమార్చన, హోమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు. త్రిపురాంతకంలో బాలా త్రిపురసుందరి మయూర వాహనంపై స్కందమాతగా దర్శనమిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్


టంగుటూరు: వల్లూరమ్మ ఆలయంలో మహాచండిగా..


మార్కాపురం చెన్నకేశవాలయంలో గజలక్ష్మీదేవిగా..


మయూర వాహనంపై స్కందమాతగా బాలా త్రిపురసుందరి


కంభంలో గజలక్ష్మీదేవిగా వాసవీమాత


కురిచేడు : అయిగిరి నందిని నృత్య రూపకం


పామూరు వాసవీ ఆలయంలో మహాగణపతి హోమంలో భక్తులు

శివసాయి ఎయిడెడ్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని శివసాయి ఎయిడెడ్ పాఠశాల అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఆర్‌జేడీ, డీవైఈఓకు తాను ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్కూల్ మాజీ ఉద్యోగి సాయిరామ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. శివసాయి ఎయిడెడ్ పాఠశాల అక్రమాలపై తాను సాక్ష్యాధారాలతో సహా డీఈఓకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బోగస్ రోల్ నమోదు చేయడంతో పాటు కరస్పాండెంట్ కూతురు నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగం చేస్తున్నారని, ఆయన కొడుకు సెలవులో ఉండి కూడా వేతనం తీసుకుంటున్నాడని పేర్కొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రికార్డులను తారుమారు చేస్తున్నట్లు జూలైలోనే అధికారులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మరోమారు ఫిర్యాదు చేయగా జాయింట్ కలెక్టర్ పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని డీవైఈఓను ఆదేశించారని పేర్కొన్నారు. ఆ మేరకు విచారణ చేపట్టాలని కోరారు. శివసాయి ఎయిడెడ్ పాఠశాల అక్రమాల వ్యవహారంపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు సాయిరామ్ స్పష్టం చేశారు.

మొండి బకాయా..
వసూలు కావోయ్‌!

- మున్సిపాలిటీల్లో భారీగా ఆస్తి పన్ను బకాయిలు
- జిల్లాలో ఆస్తి పన్ను డిమాండ్ రూ.65.69 కోట్లు
- ఇప్పటి వరకు వసూలైంది రూ.26.50 కోట్లే..
- లక్ష్యం మేర వసూళ్లలో అధికారులు విఫలం
- అట్టడుగున పొదిలి, దర్శి నగర పంచాయతీలు, మార్కాపురం మున్సిపాలిటీ



జిల్లాలో ఆస్తి పన్ను డిమాండ్ ఇలా..

జిల్లాలో అసెస్‌మెంట్లు 1,25,065	పన్ను డిమాండ్ రూ.65.69 కోట్లు	
ఒంగోలు కార్పొరేషన్ : అసెస్‌మెంట్లు 61,840, డిమాండ్ రూ.41.31 కోట్లు, వసూలైంది రూ.16.95 కోట్లు	**మార్కాపురం మున్సిపాలిటీ :** అసెస్‌మెంట్లు 16,714, డిమాండ్ రూ.6.94 కోట్లు, వసూలైంది రూ.2.39 కోట్లు	**కనిగిరి నగర పంచాయతీ :** అసెస్‌మెంట్లు 9,173, డిమాండ్ రూ.3.85 కోట్లు, వసూలైంది రూ.1.81 కోట్లు
గిద్దలూరు నగర పంచాయతీ : అసెస్‌మెంట్లు 11,413, డిమాండ్ రూ.3.93 కోట్లు, వసూలైంది రూ.1.64 కోట్లు	**చీమకుర్తి నగర పంచాయతీ :** అసెస్‌మెంట్లు 6,376, డిమాండ్ రూ.2.77 కోట్లు, వసూలైంది రూ.1.35 కోట్లు	**దర్శి నగర పంచాయతీ :** అసెస్‌మెంట్లు 9,122, డిమాండ్ రూ.4.41 కోట్లు, వసూలైంది రూ.1.51 కోట్లు
పొదిలి నగర పంచాయతీ : అసెస్‌మెంట్లు 10,427	డిమాండ్ రూ.2.49 కోట్లు	వసూలైంది 0.61 లక్షలు

మార్కాపురం టౌన్: పట్టణ ప్రాంతాల అభివృద్ధికి మూలాధారం ఆస్తి పన్నులే. అయితే పన్ను వసూలు చేయడంలో అధికార యంత్రాంగా విఫలమవుతోందని ప్రభుత్వ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. నగరపాలక సంస్థ, పురపాలక సంఘాల్లో ఉద్యోగుల వేతనం, కార్యాలయాల నిర్వహణతోపాటు అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను ప్రధానంగా ఆస్తి పన్నుల రూపంలోనే సమకూర్చుకోవాలి. కానీ పన్ను వసూళ్లలో జిల్లాలోని మున్సిపాలిటీలు వెనుకబడిపోతున్నాయి. జిల్లాలో ఒక కార్పొరేషన్‌తో పాటు ఆరు మున్సిపాల్టీలు/నగరపంచాయితీలు ఉన్నాయి. జిల్లాలో ఆస్తి పన్ను రూ.65.69 కోట్లు డిమాండ్ ఉండగా ఇప్పటి వరకు సుమారు రూ.26.50 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. 5 శాతం రాయితీని వినియోగించుకుని ఏప్రిల్‌లో కొందరు ముందస్తుగా పన్ను చెల్లించడం వల్లే ఈ మాత్రమైనా ఆదాయం చేకూరిందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

వసూళ్లలో అట్టడుగున పొదిలి

పన్ను వసూళ్లలో 83 శాతంతో చీమకుర్తి నగర పంచాయితీ మొదటి స్థానంలో ఉండగా, 80 శాతంతో కనిగిరి, 71 శాతంతో గిద్దలూరు, 70 శాతంతో ఒంగోలు కార్పొరేషన్, 59 శాతంతో మార్కాపురం, 58 శాతంతో దర్శి, 41 శాతంతో పొదిలి నగర పంచాయతీ తర్వాత స్థానాల్లో నిలిచాయి.

దోస్త్ మేరా దోస్త్..


ఆత్మీయ వేడుకలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గిద్దలూరు రూరల్: వారంతా 60 ఏళ్లు నిండిన పూర్వ విద్యార్థులు. సోమవారం తెగ సందడి చేశారు. వార్ధక్యం మీద పడిన ఛాయలేవీ వారి సంతోషానికి అవరోధం కాలేదు. ఈ అపూర్వ సమ్మేళనానికి గిద్దలూరులోని విత్తా సుబ్బరత్నం కల్యాణ మండపం వేదికైంది. గిద్దలూరు పట్టణంలోని వివేకానంద కళాశాలలో 1980-84 బ్యాచ్ డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా పలుకరించుకుని అలనాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. చదువు చెప్పిన అధ్యాపకులను సన్మానించారు. అధ్యాపకులు రాఘవరావు, శోభ, పూర్వ విద్యార్థులు రామచంద్రారెడ్డి, కోటయ్యగౌడ్, రాంభూపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో 52 నాన్ టీచింగ్ పోస్టులు

- ఎంఈవో కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ
- వివరాలు వెల్లడించిన డీఈఓ సుభద్ర

ఒంగోలు: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికిగాను 52 నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు డీఈఓ డి.సుభద్ర తెలిపారు. అర్హులైన మహిళా అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోగా ఎంఈఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టైప్ 3 కేజీబీవీల్లో హెడ్ కుక్ 7, అసిస్టెంట్ కుక్ 18, డే అండ్ నైట్ వాచ్ ఉమన్ 6, స్కావెంజర్ 5, స్వీపర్ 6 ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు. టైప్ 4 కేజీబీవీల్లో 3 హెడ్ కుక్, 3 అసిస్టెంట్ కుక్, 4 చౌకీదార్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు డీఈవో పేర్కొన్నారు. మండలాల వారీగా అభ్యర్థుల వివరాలను ఈనెల 16న వెల్లడిస్తామని చెప్పారు. 18న తుది జాబితా తయారు చేస్తామని, 21న జిల్లా కమిటీ ఆమోదం తర్వాత 22న ఆప్కాస్ చైర్మన్‌కు జాబితాను సమర్పిస్తామని, అదే రోజు రిపోర్టింగ్ ఉత్తర్వులు జారీ అవుతాయని వివరించారు. 2024 జూలై 1 నాటికి ఓసీ అభ్యర్థులు 42 ఏళ్లు, మాజీ సైనికులు 45 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యుఎస్ అభ్యర్థుల వయసు 47 ఏళ్లు మించరాదని తెలిపారు. పీహెచ్‌సీ అభ్యర్థులకు 52 ఏళ్ల వరకు మినహాయింపు ఉందని తెలిపారు. డే/నైట్ వాచ్ ఉమన్, చౌకీదార్ పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు మాత్రం తప్పనిసరిగా 7వ తరగతి ఉత్తీర్ణులు కావాలని, మిగిలిన పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారికి విద్యార్హతలు తప్పనిసరి కాదని స్పష్టం చేశారు.

పరిష్కరించగలిగే సమస్యలు పరిష్కరిస్తాం

- సాంఘిక సంక్షేమ శాఖామంత్రి స్వామి


అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి స్వామి

సింగరాయకొండ: పరిష్కరింగలిగే సమస్యలను పరిష్కరిస్తామని, ఇందు కోసం ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరించామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి చెప్పారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సోమవారం మీ కోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ప్రధానంగా రెవెన్యూ సమస్యలు, ఇళ్ల పట్టాలు, భూ ఆక్రమణపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. దేవదాయ భూముల రిజిస్ట్రేషన్ సమస్యపై సీఎం చంద్రబాబుతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. విమానాల రన్‌వేపై కనుమళ్ల జంక్షన్ వద్ద ప్రత్యేక సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని హైవే అధికారులను ఆదేశించామన్నారు. కొత్త పెన్షన్లకు దరఖాస్తులు అందాయని తెలిపారు. సోషల్ ఆడిట్, గ్రామసభల ద్వారా అనర్హులను తొలగిస్తామన్నారు. ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, ఆర్‌అండ్‌బీ ఏఈ మాధవరావు, ఎంపీడీఓ డి.జయమణి, సీఐ హజరత్తయ్య, ఎస్సై మహేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టిప్పర్‌ను ఢీకొట్టిన మినీలారీ

బేస్తవారిపేట: టిప్పర్‌ను మినీలారీ ఢీకొట్టడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం తెల్లవారుజామున బేస్తవారిపేట మండలంలోని పూసలపాడు సమీపంలో ఒంగోలు-నంద్యాల హైవేపై చోటుచేసుకుంది. వివరాలు.. అన్నమయ్య జిల్లా చర్లోపల్లెకు చెందిన డ్రైవర్ గంగాధర్ మినీలారీలో టమోటా లోడుతో గిద్దలూరు వైపు తీసుకెళ్తున్నాడు. పూసలపాడు వద్ద వ్లేళ్లే సమయానికి నిద్రమత్తులోకి జారుకున్న డ్రైవర్.. కంకర లోడుతో ముందు వెళ్తున్న టిప్పర్‌ను ఢీకొట్టాడు. మినీలారీ క్యాబిన్ నుజ్జు నుజ్జు అకావడంతో డ్రైవర్ గంగాధర్ అందులో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను బయటకు తీసి 108లో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇదిలా ఉండగా.. రోడ్డు పక్కన ఉన్న మినీలారీని ఎదురుగా వస్తున్న మినీ ట్రక్ ఢీకొట్టింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన డ్రైవర్ గంగాధర్

ఆట్యాపాట్యా పోటీల్లో 'ప్రకాశం'కు మూడో స్థానం


క్రీడాకారులను అభినందిస్తున్న నంబూరి శ్రీనివాసులు

ఒంగోలు: ఆట్యాపాట్యా 9వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఆటల పోటీల్లో జిల్లా బాలికలు మూడో స్థానంలో నిలిచారు. ఈ నెల 5,6 తేదీల్లో నెల్లూరులో నిర్వహించిన పోటీల్లో బాలికలు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా వారిని జిల్లా అధ్యక్షుడు నంబూరి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు సుబ్బారావు అభినందించారు.

తర్లుపాడు హైస్కూల్లో భారీ జాతీయ పతాకం

తర్లుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవ వేడుకలను పురస్కరించుకుని పూర్వ విద్యార్థి కె.కాశిరెడ్డి 37.5 అడుగుల భారీ జాతీయ పతాకాన్ని బహూకరించారు. దేశభక్తిని పెంపొందించేలా భారీ జాతీయ పతాకాన్ని అందించిన పూర్వ విద్యార్థిని హెచ్‌ఎం సుధాకర్, కమిటీ సభ్యుడు జగన్‌బాబు, గ్రామస్తులు, మిత్రులు అభినందించారు. ఈనెల 27న వజ్రోత్సవ వేడుకల సందర్భంగా భారీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.


పాఠశాలలో ఏర్పాటు చేసిన భారీ జాతీయ పతాకం

జాతీయ స్థాయిలో డా.లోకేష్‌కు బహుమతి


డా.లోకేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డా.ఏడుకొండలు

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ ఫార్మకాలజిస్టుల సొసైటీ నిర్వహించిన ఆప్కాన్ 6వ జాతీయ సదస్సులో ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలలో రెండో సంవత్సరం పోస్టు గ్రాడ్యుయేట్ చదువుతున్న డాక్టర్ లోకేష్ కుమార్‌కు మూడో బహుమతి లభించింది. విశాఖ పట్నంలోని గీతం మెడికల్ కాలేజీలో ఇండియన్ ఫార్మకాలజిస్టుల అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన సదస్సులో రొటీన్ మెడిసిన్ స్ట్రైక్స్, 'ఆఫ్ బాబున్ సింద్రోమ్' అనే అంశాలపై పోస్టర్‌ను ప్రదర్శించారు. జాతీయ స్థాయి పోస్టర్ విభాగంలో లోకేష్ కుమార్ బహుమతి సాధించి ఒంగోలు వైద్య కళాశాలకు పేరు తీసుకొని రావడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ డా.ఏడుకొండలు చెప్పారు. సోమవారం ప్రిన్సిపాల్ చాంబర్లో డా.లోకేష్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల కాలంలో ఒంగోలు వైద్య కళాశాల విద్యార్థులు వరుసగా వివిధ సెమినార్స్, వర్క్ షాపులో పాల్గొని బహుమతులు సాధించడంపై సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని కోరారు.